క్లుప్తంగా

అశ్వవాహనంపై శ్రీవారు



కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం స్వామి అశ్వ వాహనంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు దీప జ్యోతులు ప్రదర్శించారు. అంతకు ముందు స్వామికి పంచామృతాభిషేకం, రుద్ర పాశుపత హోమం నిర్వహించారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

108 ఉద్యోగులకు పని భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా 108 సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు పని భద్రత కల్పనకు రెగ్యులరైజేషన్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపా .ధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవా రం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో 108 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఒక్కరోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా 4500 మంది ఉద్యోగులు 108 సంస్థలో పనిచేస్తున్నారని, ఇటీవల 72 మందిని అన్యాయంగా సంస్థ తొలగించిందన్నారు.వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నా రు. అరబిందో సంస్థ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తోందన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రతినెలా జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు బుజ్జి, జీవన్, మహేష్, తారక్, పవన్, గోపాల్, వెంకటశేషయ్య, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

కంబళ్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయండి

కర్నూలు(అర్బన్) : కర్నూలులో కంబళ్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి వెనుకబడిన కురువలను ఆదుకోవాలని జిల్లా కురువ సంఘం నేతలు కేంద్ర మంత్రి దేవు సిన్హ్ చౌహాన్‌ను కోరారు. సోమవారం సాయంత్రం కర్నూలుకు వచ్చిన ఆయనను పలువురు కురువ సంఘం నేతలు కలిసి కంబళ్ల పరిశ్రమ ఏర్పాటుపై వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం గౌరవాధ్యక్షుడు కె.కిష్టన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బస్సు యాత్ర కర్నూలుకు రాక

కర్నూలు(సెంట్రల్): ఏపీకి ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన బస్సు యాత్ర 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు చేరుకోనున్నది. సోమవారం కలెక్టరేట్‌లోని మీడియా భవన్ ఎదుట డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న యాత్ర కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు తీర్చాలి

కర్నూలు(రాజ్‌విహార్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షురాలు పి. నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

సైనస్‌కు మెరుగైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్): ముక్కు సమీపంలో ఉండే గాలి గదుల్లో ఏర్పడే సైనస్ సమస్యలకు ఎండోస్కోపిక్ పరికరంతో మెరుగైన చికిత్స అందించవచ్చని ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ బి. జయప్రకాష్‌రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నూతన వైద్యులకు సైనస్ సమస్యలకు ఎండోస్కోపి ద్వారా ఎలా చికిత్స చేయాలనే అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా బి. జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎండోస్కోపి పద్ధతి ద్వారా ముఖంపై ఎలాంటి కోత లేకుండా ముక్కులోకి పరికరాన్ని పంపించి సమస్యను నివృత్తి చేస్తామన్నారు. ముక్కు సున్నితభాగం కాబట్టి అత్యంత క్లిష్టమైన ఈ వైద్యచికిత్సపై నూతన వైద్యులకు నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

శివ భక్తులకు అన్నదానం



పూజల్లో పాల్గొన్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు కల్చరల్: దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయంలో శివ దీక్షా స్వాములకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నగర మేయర్ బీవై రామయ్య ప్రారంభించారు. కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందు మేయర్ స్వామికి పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందిస్తే ఆపద్బాంధవుడే!

- క్షతగాత్రులను కాపాడటంలో చొరవ చూపాలి
- బాధితుడిని ఆసుపత్రికి నిరభ్యంతరంగా తీసుకెళ్లొచ్చు
- ఎవ్వరూ ఎలాంటి ప్రశ్నలు అడగరు
- రోడ్డు ప్రమాదాల మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త చట్టం



కర్నూలు(హాస్పిటల్): ఇకపై ఎవరైనా రోడ్డు ప్రమాదాల్లో గాయపడితే ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సంకోచించాల్సిన పనిలేదు. ఇదివరకులాగా వారిని ఆసుపత్రిలో గానీ, పోలీసులు గానీ ఎవ్వరూ ఎలాంటి ప్రశ్నలు, వివరాలు అడగరు. ఈ మేరకు భారత ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసింది. రహదారి ప్రమాదాల్లో గాయపడ్డ వారి మరణాలను తగ్గించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సమారిటియన్' అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ప్రమాద బాధితులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు చాలా కీలకం. అయితే, వివిధ కారణాలతో ఎవరైనా రోడ్డు ప్రమాదానికి గురైతే వారిని హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు చాలా మంది సంకోచిస్తున్నారు. దయతలిచి క్షతగాత్రులకు సహాయం చేస్తే మెడికో లీగల్ కేసులో భాగంగా పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది ఇబ్బంది పెడతారని మరి కొందరి భయం. దీంతో విలువైన ప్రాణాలు తక్షణ వైద్యసహాయం అందక గాలిలో కలిసిపోతున్నాయని ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ మరణాలను తగ్గించేందుకు గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రులకు తరలించేందుకు సహాయపడిన వ్యక్తులకు రక్షణ కోసం కేంద్రం నూతన చట్టం తీసుకొచ్చినట్లు రవాణా శాఖ ఉప కమిషనర్ కె. శ్రీధర్ చెప్పారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. రహదారి ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని హాస్పిటల్ సిబ్బంది వేధించ కూడదని, బాధితుని అడ్మిట్ చేసుకోవాలి గానీ, సహాయకుని గుర్తింపు గానీ, చిరునామా గానీ అడిగి వేధించ కూడదని వైద్యులకు చెప్పినట్లు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో కూడా కేసు విషయంలో సహాయకారిని ఏ విధమైన ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగకూడదని, వారి సాక్ష్యం కోసం బలవంతం చేయకూడదన్నారు. తప్పని పరిస్థితుల్లో సాక్ష్యం కోసం స్వయంగా ముందుకు వచ్చిన సహాయకారిని సంబంధిత కోర్టు విచారణ ఒక రోజులోనే ముగించాలని, రెండోసారి పిలవకూడదని పేర్కొనట్లు ఆయన తెలిపారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన



టిడ్కో ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న కేంద్రమంత్రి

కర్నూలు కల్చరల్: కేంద్ర టెలి కమ్యూనికేషన్స్ ఐటీ శాఖ మంత్రి దేవు సిన్హ్ చౌహాన్ ప్రవాసీ పార్లమెంటరీ యోజనలో భాగంగా సోమవారం కర్నూలులో పర్యటించారు. నగర శివారులో ఉన్న టిడ్కో గృహాలను బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. అంతకు ముందు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ బుధవార పేటలో ఏర్పాటు చేసిన సామూహిక సహపంక్తి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. కొండారెడ్డి బురుజును సందర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి వాల్మీకి, పార్టీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ కపిలేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పనుల్లో వేగం పెంచాలి

- మండలాధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్) : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ పి.కోటేశ్వరారవు మండలాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూఫ్ లెవల్‌లో ఉన్న వాటిని రూఫ్‌కాస్టు, రూఫ్ కాస్టులో ఉన్న ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలన్నారు. కాగా, పూర్తయిన ఇళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజాప్రతినిధులు సూచించిన పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. టెండర్ దశలో ఉన్న పనులను పురోగతిలోకి తీసుకురావాలన్నారు. నాడు-నేడుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కాంపౌండ్‌లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలన్నారు. పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను ప్రారంభించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలు పాటించాలి

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలను పాటించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు జాయింట్ కమిషన్‌ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, ఐసీడీఎస్ పీడీ కుమారిలతో కలసి జాతీయ బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన జాయింట్ కమిటీతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 0-18 సంవత్సరాలోపు పిల్లలపై లైంగిక నేరాలను నియంత్రించాలన్నారు. పాఠశాలలకు దగ్గరలో ఎక్కడా వైన్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఈబీ అధికారులను ఆదేశించారు. పాఠశాలల సమీపంలో పాన్, సిగరెట్ అమ్మే షాపులు ఉండకూడదని, ఉంటే గుర్తించి నివేదిక ఇవ్వాలని డీఈఓ రంగారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జుబేదబేగం, డీఈఓ రంగారెడ్డి, సీపీఓ అప్పలకొండ, డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య, డీసీహెచ్ఎస్ రాంజీనాయక్ పాల్గొన్నారు.

ఆదర్శనీయులు నేతాజీ సుభాష్ చంద్రబోస్

కర్నూలు సిటీ: స్వతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆదర్శనీయులని పలువురు కొనియాడారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ కమిటీ ఆధ్వర్యంలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి(పాత కంట్రోల్ రూం)సర్కిల్ నుంచి పాత బస్టాండ్ దగ్గర ఉన్న డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ప్రారంభించి ప్రసంగించారు. నేతాజీ ఆశయసాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తేజోవతి, ఏబీవీపీ సిటీ సెక్రటరీ మల్లేష్, అఖిల్, సత్రప్ప, ఏఐఎంఎస్ఎస్ సిటీ సెక్రటరీ ప్రియాంక, సంధ్య, సుజాత, బీఎస్ఎస్ సిటీ ఇన్‌చార్జ్ విశ్వనాథరెడ్డి, రాజు, జితేంద్ర, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో

కర్నూలు(లీగల్): కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆర్.కృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా, ప్రధాన కార్యదర్శి కాటం రంగడు, సీనియర్ న్యాయవాదులు కె.ఓంకార్, జోగయ్య శర్మ, బి.గోపాలకృష్ణుడు తదితరులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యా సంస్థల్లో...

కర్నూలు సిటీ: పలు విద్యా సంస్థల్లో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ నేతాజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు జి.ప్రసన్న కుమార్, వైవీ రామకృష్ణ, యు.నాగరాజు, ఎస్.కృష్ణమోహన్, పార్థసారథి, పటేల్, సోమేష్, సుజాత, రోహిణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

- కేవీఆర్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఎస్. శ్రీనివాసరెడ్డి పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్కూల్ టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.
- పాణ్యం: ఆజాద్ హిందు ఫౌజ్ వ్యవస్థాపకులు, నేతాజీ సుభాష్ చంద్రబోష్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పాణ్యం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యం డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి సందర్భంగా.. ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ.. యువత నేతాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- స్పందన కార్యక్రమంలో మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ రమాదేవి
- వివిధ సమస్యలపై పలువురు వినతి



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రమాదేవి

కర్నూలు(టౌన్):ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు నగరపాలక డిప్యూటీ కమిషనర్ రమాదేవి అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఎస్ఈ శేషాసాయి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడుతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అర్జీదారులకు హామీ ఇచ్చారు.

వినతులు ఇవే..

- తమ కాలనీకి ఉత్తర దిక్కున ఉన్న రోడ్డును ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు వాసవీనగర్‌కు చెందిన హీరాలాల్ మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.
- మున్సిపల్ పార్కుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీకి చెందిన ప్రేమసాగర్ కోరారు.
- డ్రైనేజీలు నిండిపోయి మురుగు రోడ్లపైకి వస్తుందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సోమిశెట్టినగర్‌కు చెందిన జగదీశ్వర రెడ్డి విన్నవించారు.
- తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, పార్కుల ఏర్పాటు చేయాలని ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన నాగరాజు కోరారు.
- తమ వీధికి కొత్తగా రోడ్డు మంజూరైందని, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వాసవీనగర్‌కు చెందిన లక్ష్మణ్ అధికారులను కోరారు.
- వాసవీనగర్, రిచ్మండ్ కాలనీలకు తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆ కాలనీలకు చెందిన హీరాలాల్ విన్నవించారు.
- టిడ్కో గృహం మంజూరయ్యేలా చూడాలని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన అంజనేయులు మునిసిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ అధికారుల సంఘం డైరీ,క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీని విడుదల చేస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం 2023వ సంవత్సరం డైరీ, టేబుల్ క్యాలండర్‌ను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు విడుదల చేశారు. సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నేతలతో కలిసి వాటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఇటు రైతులు, అటు వ్యవసాయ యంత్రాంగాన్ని దృష్టిలో పెట్టుకొని డైరీ విడుదల చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, దస్తగిరిరెడ్డి, కోశాధికారి రామకృష్ణ, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఆదోని ఏడీఏ గిరీష్, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, కోడుమూరు, వెల్దుర్తి ఏఓలు రవిప్రకాశ్, అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి



యువభారత్ సేవా సమితి సభ్యులతో మైనార్టీ సంక్షేమాధికారి మహమ్మద్ బాషా, డాక్టర్ మోక్షేశ్వరుడు

కర్నూలు(హాస్పిటల్): యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మహమ్మద్‌బాషా, రిటైర్డ్ టీబీసీడీ అధికారి డాక్టర్ మోక్షేశ్వరుడు చెప్పారు. సోమవారం స్థానిక దేవిఫంక్షన్ హాలులో యువభారత్ సేవా సమితి 4వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ముందుగా సుభాష్ చంద్రబోస్ 126 జయంతిని పురస్కరించుకుని 126 మందితో రక్తదానం చేయించారు. అనంతరం ద్రోణాచలం సేవా సమితి, స్టార్ ఫౌండేషన్ (కడప), నేస్తం సేవా సంస్థ (మైదుకూరు) ప్రతినిధులను, అంధులకు విద్యాదాన బాధ్యతలను స్వీకరించిన భువన, మురికివాడల్లోని నిరుపేద బాలింతలకు సేవ చేస్తున్న సువర్ణకుమారిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యువభారత్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు సుబ్బారావు, అధ్యక్షురాలు రేణుక, గౌరవ సలహాదారులు ఉప్పరపల్లి సుధాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పొడిగింపుపై హర్షం



కలెక్టరేట్ ఎదుట హర్షం వ్యక్తం చేసేందుకు వచ్చిన కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని మరో పదేళ్లపాటు ప్రభుత్వం పొడిగించడంపై కేవీపీఎస్ హర్షం వ్యక్తం చేసింది. సోమవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం-2013 నియమ, నిబంధనలు చాప్టర్-4 ద్వారా జనవరి 23వ తేదీ కాలపరిమితి ముగుస్తున్న నేపథ్యంలో పదేళ్లకు పొగిడించడం హర్షణీయమన్నారు. గత పది సంవత్సరాల కాలంలో 54.5 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేశారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.15 వేల కోట్లను కేటాయించారన్నారు. అయితే,సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణ, విజయమ్మ, రాజు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష చూపొద్దు

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో బాలికల పట్ల వివక్ష చూపకూడదని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం గార్గేయపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటి పడావో-బేటి బచావో కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో బాలురతో సమానంగా బాలికలు విజయాలు సాధిస్తున్నారని, స్త్రీ లేకపోతే సృష్టి లేదన్నారు. అనంతరం బేటి బచావో-బేటి పడావో పోస్టర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిణి డాక్టర్ విజయలక్ష్మి, హెడ్‌మాస్టర్ వెంకటరాముడు, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణలతో కలిసి ఆవిష్కరించారు.

26న విద్యార్థుల సాంఘిక్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) కళాశాల విద్యార్థుల సాంఘిక్‌ను ఈనెల 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర సంఘచాలక్ సూరా వెంకటరెడ్డి తెలిపారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ హెచ్‌ఓడీ ఎస్.నాగరాజు రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఫిబ్రవరి 15,16 తేదీల్లో నిర్వహించే ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ భవన్‌లో మహాసభలకు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు.

28న రాయలసీమ ప్రజా ప్రదర్శన

కర్నూలు కల్చరల్: సిద్దేశ్వరం - సోమశిల ప్రాజెక్ట్ దగ్గర బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28వ తేదీన రాయలసీమ మేధావుల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాయలసీమ అభివృద్ధి కమిటీ కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక కర్నూలు కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

లోడర్, జేసీబీ కొనుగోలుకు నిధులు మంజూరు

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక సంస్థకు ప్రజా అవసరాల కోసం లోడర్, హిటాచీ (జేసీబీ) కొనుగోలుకు నంద్యాల ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరయ్యాయి. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విన్నపం మేరకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్పందించి తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.37.50 లక్షలు కేటాయించారు. సోమవారం ఆ నిధులకు సంబంధించి పరిపాలన అనుమతులు మంజూరైనట్లు నగరపాలక అధికారులు తెలిపారు.

జిల్లా వాసులకు జాతీయ సమైక్యతా పురస్కారం



స్వరూప్ సిన్హా దంపతులకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన డాక్టర్ స్వరూప్ సిన్హా, వయోల సిన్హా దంపతులకు జాతీయ సమైక్యతా పురస్కారం లభించింది. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో హెల్త్ కేర్ అంతర్జాతీయ సంస్థ, అమెరికా ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ పురస్కారం అందజేశారు. స్వరూప్ సిన్హా, వయోల సిన్హా మాంటిస్సోరి, ఉస్మానియా మహిళా డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులుగా సేవలందిస్తూనే సంగీత, సాహిత్య రంగాల్లో ఎనలేని ప్రతిభ చూపుతుండటంతో తెలంగాణ మంత్రులు వేణుగోపాలాచారి, ఉప్పల శ్రీనివాస గుప్త, బీసీ కార్పొరేషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, సంస్థ అధ్యక్షుడు లయన్ కొల్లారి చంద్రశేఖర్ జాతీయ సమైక్యతా పురస్కారాన్ని ప్రదానం చేశారు.

మహావీర్ బోధనలు అనుసరణీయం



మహావీర్ ధామ్ ఆలయ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలో ఎమ్మెల్యే కాటసాని, ఎస్వీ విజయమనోహరి

కర్నూలు కల్చరల్: మహావీర్ బోధనలు అనుసరణీయమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. నగర శివారులోని పంచలింగాల కూడలి సమీపంలో మహావీర్ ధామ్ ఆలయ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఆచార్య భగవత్ తీర్థ చంద్ర సుర్జీ పర్యవేక్షణలో కుంచ స్థాపన, దీప స్థాపన, కల్యాణి పూజ, భక్తి గీతాలాపన తదితర విశిష్ట పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. పాణ్య ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత ఎస్వీ విజయమనోహరి,యువ నాయకులు ఎస్వీ జనకదత్తా రెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈనెల 26వ తేదీ వరకు ప్రాణ ప్రతిష్ఠ పూజలు జరుగుతాయని జైన్ సంఘ్ ప్రతినిధులు వెల్లడించారు.

ఘనంగా వాసవీ దేవి ఆత్మార్పణోత్సవం

కర్నూలు కల్చరల్: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆత్మార్పణోత్సవ కార్యక్రమం సోమవారం నగరంలో ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలబజార్, మించిన్ బజార్, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, అన్నదానం, జ్యోతి ఉత్సవం నిర్వహించారు. అమ్మవారు ఆత్మార్పణ గావించి 1022 సంవత్సరాలు అయిందని ఆర్యవైశ్య సంఘం నాయకులు చెప్పారు. పూజల్లో అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మెడికల్ రెప్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీఎస్ కోటేశ్వరరావు, నాయకులు ప్రసాదశర్మ, బసవరాజు, వెంకట్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం సందర్భంగా ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా మారుతి, సహాధ్యక్షులుగా ఖలీల్, శివరంగ, కార్యదర్శిగా శేషాద్రి, సహాయ కార్యదర్శులుగా రాఘవేంద్ర, షేక్షావలి, కోశాధికారిగా సురేంద్ర ఎన్నికైనట్లు వివరించారు.